# పిచ్చినమ్మకము

పెమ్మరాజు లక్ష్మీపతి గారు

మాణిక్యాంబ ప్రకాశముగారికుమార్తె. తొమ్మిది పదేండ్లవయస్సు కలది. ఉట్టి నందుకొనగలిగి నను నందలివస్తువులు గ్రిందికి దింపజాలినంతపొడుగైనది కాదు. రెండుమూడేండ్లక్రిందట జబ్బుచేయుటచే నూడి పోయి తిరిగి మొలచిన నల్లనితలవెండ్రుకలు సొగసుగ మెలికలుతిరిగి పాపట కిరుప్రక్కలను కెరటములవలె చెవులక్రిందికి దిగజారుచు భుజముల కంటియు నంటకుండ నుండును. తెల్ల తామర రేకులయందు మూగు తుమ్మెదల వలె తెల్లనికనులయందు నల్లనిగ్రుడ్లు చలించు చుండును. కను కొలకులయందు కాటుక రేకలు కనుబడు చుండును. మొగమునడుమ సొగసుగ నగరుబొట్టు పెట్టుకొని పైన కుంకుమము సద్దుచుండును.

* * * * *

అది శ్రావణమాసము. ఆనాడు శుక్రవాసరము అప్పటికి పెండ్లియై, యైదారునెలలు కావచ్చినది. శ్రావణ పట్టీ నింకను నత్తవారు పట్టించుకొని రాలేదు. ఆవారమే తెచ్చెదరో లేక ముందువారమే తెత్తురో యని తలిదండ్రులనుకొనుమాటలు మాణిక్యాంబ విననట్లుగ వినుచుండును. పొగబండి ఆయూరునకు పదకొండుగంటలకు వచ్చుచుండును. ఆనాడు మనియార్డరు వచ్చుటయో లేక వియ్యాలవారు వచ్చుటయో తప్పక జరుగునని తలంచుచు నెదురుచూచుచుండిరి.

* * * *

మాణిక్యాంబకు ఉదయముననే తలయంటిరి. ఆసమయమున మొగమునకు రాచినపసపుయొక్క మిసిమి ముఖమున నంటుకొనియేయున్నది. మొగము నడుమ గుండ్రముగ కుంకుమబొట్టు పెట్టుకొన్నది. ముడుచుటకుగాని జడయల్లుటకుగాని వీలుగాక తలయంటినకారణముచే దలవెండ్రుకలు నిగనిగనై జలజలలాడు ముఖముపై బడుచుండుటయు మాటిమాటికిని చేతిగాజులు గలగలలాడుచుండ వానిని వెనుకకు త్రోసికొనుచుండుటయు నొకవింత యొయ్యారమును చూపుచుండెను.

* * * * *

పడమటింటియొక్క యుత్తరముగోడ నానుకొని మహాలక్ష్మీపీఠము కలదు. ఆనాడు 'అమ్మవారియరుగు' చక్కగ నలికి రంగవల్లికలు దీర్చిరి. దానిపై నొకంత యెత్తున మామిడియాకులు తామరపువ్వులు కలువపూలు కలిగి చెఱకుగోలలకు పాలవెల్లి వ్రేలాడుచుండెను. అరుగుపై నొకచిన్నకుర్చీపీటయు, దానికి రాచిన పసుపుపై పిండితో నొనర్చినట్టిను, నద్దానిపై నిగనిగలాడు నారకూటకలశమును పై నొక పచ్చనికొబ్బరిబొండమును కలవు. రైకలగుడ్డ నొకదానిని టోపీవలెమడచి దానికి దొడిగియుంచిరి. ఆపీఠమునకు సమీపమున నొకయిత్తడి పళ్లెము కలదు. దానియందు గన్నేరుపూలు, పత్రి, మందారపుష్పములు, రాధామాధవగుత్తులు మున్నగు పూజాద్రవ్యములు కలవు.

* * * * *

అప్పుడు పదిగంటలైనది. "అమ్మాయీ, త్వరగా పట్టుచీర కట్టుకో నరసింహశాస్త్రిలుగారు వచ్చేవేళైంది." (పురోహితుడు) అని తల్లి చెప్పగా విని మాణిక్యాంబ గదిలోనికిబోయి తనయత్తవారు పెండ్లికి బెట్టిన బరంపురం లక్కరంగు పట్టుచీర కట్టుకొని, దట్టమగుచీర కుచ్చెళ్లుబిగి యుండుటచే తనకడు పక్కలించి బంగారపుటొడ్డాణమును పైన బిగించినది. దక్షిణాదియంచుల గళ్లపట్టురవిక

తొడిగికొని మంగళసూత్రము, కఱెు పైకికనబడునట్లు పెట్టినది. పైటచెరగుచే కంఠమాత్రము సగము కనబడుచున్నది. ఇట్లలంకరించుకొని చక్కనిచుక్కయగు నా చిన్నిముత్తైదువ తల్లితో 'అమ్మా, అయిందే' అని చెప్పి పరుగునబోయి తల్లికి తనసింగారమును చూపినది. తల్లియు సంతసించి "మాబంగారుతల్లీ! బాగుంది; ఇదిగో మీబాబయ్యగారు వస్తారు. ఈలోపుగా——"అని యేమో చెప్పబోవుసరికి యింతలో వీథిగుమ్మముకడ నెవ్వరో "ఏమండో, ప్రకాశముపంతులుగారున్నారా?" అని కేక వేయుటయు నాకంఠస్వరము పోస్టుబంట్రోతు కంఠస్వరము వలె నుండ గ్రహించి యుత్సాహముతో మాణిక్యాంబ 'అదిగో పోస్టుబంట్రోతు వచ్చాడే' అని తల్లితో నని ఒక్కపరుగున బోయి వీథితలుపు తెరచి యతనింజూచి



"మాబాబయ్యగారికి మనియార్డరు వచ్చిందా?" అనియడిగినది.

* * * * *

ఆబంట్రోతున కా యలంకృతయగు బాలికను చూచుసరికే గుండె లదరినవి; ఒడలు జల్లుమనినది; కాలుసేతులు కంపించుచున్నవి. ఆయుత్తరము నాతడు ముందే చదువుకొనియుండుటయే దీనికి గారణము. నోట మాట రాక జవాబీయక యట్లే నిలువబడి చివరకు డగ్గుత్తికతో నామెతో 'మీ నాన్నగారిని పిలవండమ్మా' అన్నాడు. ఇంతలో తల్లి యీవలకువచ్చి "అబ్బాయీ! ఈయన యిప్పుడే అల్లా పోస్టుఆఫీసుదగ్గరకే వచ్చారు. నీకు కనిపించలేదా?" అన్నది. "లేదమ్మా ఆయనకు ఒకఉత్తరం——" అని మాట్లాడలేక యూరకుండెను. "ఉత్తరం వచ్చిందా, నాయనా! ఎక్కడనుంచో చూడు, కొంచెము." అని యామె చెప్పుటయు నాతడా యుత్తరమును చూచి 'అమలాపురం నుంచి' యని యనగానే యామె హర్ష సంభ్రమముతో 'అయితే మా వియ్యాలవారు వ్రాసిందే; చదువు, నాయనా!' అని పలికినది. ఆతడది చదువలేక 'అమ్మా, శేషావతారంగారెవరండి?' అనియును మానించుచుదిగులుపడి యడుగుటయు నాతని ముఖవైఖరి నుపలక్షించియామె తత్తరముతో "ఏం నాయనా, మా అల్లుడే అతడు; ఏం నాయనా, అట్లా అంటావు?' అని పలుక


నతడు "ఏం చదవనమ్మా, మీరుచేసిన 'నిర్వాకమే'యిది. ఎవరిచేతనైనా చదివించుకోండి" అని అన్నాడు.

* * * * *

దానితో గుండెలలో రాయి పడినది. ఆలోచన తోచదయ్యెను. నిశ్చేష్టురాలై నివ్వెరగంది నిలువబడి యుండ నింతలో చిన్నకొమారుడు బడినుండి యింటికి వచ్చినాడు. తెలతెలబోవు తల్లిని చూచి బంట్రోతు చేతిలో నున్నయుత్తరమును పుచ్చుకొని చదువ నారంభించెను. తల్లి యింతలో నొకించుక ధైర్యము చిక్కబట్టి "నాయనా, చూడు 'క్షేమం' అని ఉందా పైన." అన్నది. బాలుడు ఉత్తరము నటునిటు కలయజూచి 'అమ్మా, లే దామాట' అన్నాడు.

* * * * *

"ఇం కేమున్నది! సంగతి చాలవరకు తేలిపోయిన ట్లున్నది." శోకము కంఠమును దాటి వచ్చుచుండగా నాపుకొని "చదువు, నాయనా, మనఖర్మ మేంకాలిందో?" అని యన్నది. మాణిక్యాంబ వెలవెలబోవుచు చేతులుజోడించుకొని నిలువబడి వెఱ్ఱిచూపులుచూడ మొదలిడినది. వారిమాటలయర్థ మాబాలికకు సరిగ తెలియలేదు. అంత నాపిల్లవా డాయుత్తరము నిట్లు చదువదొడగెను 'మహారాజశ్రీ ప్రకాశముబావగారికి రాజేశ్వరరావు నమస్కారములుచేసి వ్రాయువిన్నపములు: నాకుమారుడు మొన్న ఆదివారమునాడు జబ్బుచేసి చనిపోయినాడు' అని చదివి యిక చదువలేక నాబాలు డాలేఖను చేతపట్టుకొని యరుగుపై కూలబడెను. ఆమాట చదివినతత్క్షణమున నే పిడుగుపడినవడువున నొక్క కేక పెట్టి 'యింకేముంది, మా యమ్మా?' అని కూతు నక్కున జేర్చుకొని తల్లి వీథిగుమ్మమునందే కూలబడిపోయి రోదనము చేయుచుండెను. తల్లిని జూచి మాణిక్యాంబయు నొకవెఱ్ఱికేక పెట్టి పెద్దపెట్టన 'నమ్మో, అమ్మో'యని యరచుచు నేడువసాగెను.



ఇం కేముంది · ర్చుకొని

పోస్టుబంట్రోతు నిశ్చేష్టుడై నిలువబడియుండెను. ఆ యాక్రందన ధ్వని నాలకించి యిరుగు పొరుగు జనములు—ముఖ్యముగా స్త్రీలు--పరుగుపరుగున వచ్చి గుమిగూడిరి.

* * *

"ఏం, నాయనా, యిల్లా యేడుస్తారు? చెడ్డకబురు విన్నారా యేమిటి!" అని బంట్రోతునడిగి కారణ మాతనిచే విని, నిర్విణ్ణులై యుండ నం దొకస్త్రీ 'అయ్యో తల్లీ! ఏం జబ్బమ్మా! రాయి లాంటి పిల్లాడు. మాయ

చావు! యిదేం విడ్డూరం' అయ్యో, తల్లీ! ఏడాదైనా కాలేదే పెళ్లిచేసి, అనియు, నింకొకయామె 'రామరామా! పసికూన తల్లీ! మూడేళ్లపిల్ల కీఖర్మం యేమిటమ్మా! మాయదేవుడు" అనియును ననుసరికి మాణిక్యాంబ కట్టుకొన్న పట్టుచీర నలిగి దుమ్ముచే మాయునట్లు క్రిందపడి పొరలుచును నెప్పటికన్న నెక్కువగరోదనము చేయుచు గిలగిల కొట్టుకొనసాగెను. వేరొకవనిత 'ఊరుకో, తల్లీ! కర్మానుభవం అనుభవించాలి. పెద్దదానవు నీవే యిల్లా అయితే కుర్రదానికి గుండె లాగుతాయా? ఊరుకో అమ్మా!' అని తల్లినూరార్పజొచ్చెను. ఈరీతిగ నచ్చటికి వచ్చువారును, సంగతి తెలిసికొని విచారించుచు నిలువబడువారును, మాట్లాడువారును, నూరడించువారును నై యొకయేబది యరువదిమంది కలకలము గావించుచుండిరి. తల్లియు పిల్లయు నట్లూరార్చినను మానక దురపిల్లుచునే యుండిరి. శుక్రవారం మహాలక్ష్మిపూజ చేసుకొందామని పిల్ల సరదా పడుతూంటే యిల్లాంటి బిడిగల్లు మీద పడింది. "ఇదంతా మాఖర్మం." అనుచు తల్లి యట్లే యేడ్చుచుండెను. మాటలుచెప్పుట యింకను చేతకాక మాణిక్యాంబ మాటలతో చెప్పుటకురాని మనోవేదనను రోదనధ్వనులమూలముననే చాటుచుండెను. ఆయేడ్పు అచ్చటివారలగుండెలను నీరుగా చేయుచుండెను.

* * * * * *

ఇంతలో నొక్క ముసలియామె (శూద్రవనిత) "అయ్యో! ఊరుకోండమ్మా! పగిట్టనిసచ్చినాళ్లో యేశారీ ఉత్తరం. అంతేకాని రాయిలాంటిపిల్లోడికేంటి, జబ్బేంటి ఊరుకోవమ్మా పిచ్చిదానా! పిల్లదాన్ని అదలబెడుతున్నావు! అయ్యగారిని రానియ్యి. ఉత్తరంసంగతి తెలుసుకుందాం" అని యనుసరికి యామాట లందుకొని వేరొకవనిత "ఔనమ్మా! కొన్ని అల్లాగా ఉంటాయి. మొన్న మాఊళ్లో కరణాలింటికి యిల్లాంటి ఉత్తరమే వచ్చింది." అని చెప్పదొడగనది. మబ్బులు క్రమ్మిన గాఢాంధకారమందలి మెరపులవలె నామాటలు మాణిక్యాంబతల్లి కించుక ధైర్యమునుకలిగింప నామె యొక్కింత యేడ్పుడిగి "అమ్మా! మీమాటలు నిజంకావాలి కదా! మాకంతటి యదృష్టంకూడానా" అని విచార సందేహముల డెంద మాందోళితము నొంద విలపించుచుండెను. మాణిక్యాంబ తెల్లబోయి చూచుచుండెను.

* * * * * *

అంతలో నాయింటిలో నద్దెకు నివసించుచున్న బడిపంతు లప్పుడే బడినుండి యింటికివచ్చి యాజనసమ్మర్దమును, నాకలకలమును గాంచి సంక్షుభితహృదయుడై, తగువారినడిగి కారణ మారయుచుండెను. అప్పుడావృద్ధశూద్రస్త్రీ బాలునిచేతిలోనున్న ఉత్తరమును తీసికొనిపోయి 'పంతులుగారూ, యిది సరిగా చూడండి!' అని యాయనచేత బెట్టెను. ఆయన సాంతముగ నద్దానినిచదివి "ఓహో, యిదంతా మాయగానుందే. చావుత్తరమేమిటి, 'బావగారికి నమస్కారా' లేమిటి? ఆపైన, యీదస్తూరీ రాజేశ్వరరావుగారిది కాదు. నే నిదివరకు వచ్చిన ఉత్తరాలు చూశానుకూడాను. మరేం భయంలేదు, ఊరుకోండి" అన్నాడు. నీటిలో మునుగుచున్నవాని కొకతెప్ప దొరకినట్లామె యామాటలకు ధైర్యము తెచ్చికొని స్వస్థపడజొచ్చెను. 'నేచెప్పలేదట్లా! మాయసచ్చినోళ్లు! ఆళ్ల కడుపుడకా' అని యా శూద్రస్త్రీ యనుచుండెను.

* * * * * *

తలుపు తెరచుకొని భుజమున నరటిపండ్లు, పనసపండ్లు గల కావడిని మోయుచు నొకమనుష్యుడింతలో లోపలికి వచ్చెను. వచ్చి యాగడబిడగాంచి తెల్లబోవుచు "ఏం టీగొడవ" అని యేమో యనబోవుచుండగా వాని కంఠస్వరము నానవాలుపట్టి మాణిక్యాంబ తల్లి చుట్టునున్నవారిని తప్పించుకొని చూచెను. తమవియ్యాలవారి యింటిచాకలి యతడు. పిపాసాపీడితున కెడారిలో నుదకము కనబడినట్లయ్యెను. "అప్పదూ, అంతాక్షేమమా?" అని యడిగింది దానికివాడు 'నిచ్చేపంగాఉన్నారేంటీ గోల? యెందుకమ్మా!' అనిచెప్పి యిప్పుడే "ప్రకాశంబాబయ్యగారు టేసిన్‌దగ్గిర కొచ్చారు. మాదొరగారిని కలు


సుకొన్నారు. ఆ బాబులిద్దరు యెనక మాలొత్తున్నారు. నేను కావిడేస్కుని ముందొచ్చాను" అన్నాడు.

* * * * *

దానితో మబ్బు విడిపోయిన ట్లయ్యెను. అందరి ముఖములు వికసించినవి. సంశయవిచారము లంతరించినవి. మాణిక్యాంబను చూచి తల్లి "అమ్మా, భయంలేదులే, యింకలే! దబ్బునివెళ్లి బట్టలు దులుపుకొని కట్టుకో అమ్మా, మీ మామగారు వస్తున్నారంట" అనిచెప్పి పిల్లను లోపలికి పంపి, 'ఏ మాయదారివాళ్లు వేశారో యీ ఉత్తరం; ఎల్లాంటివేళ లేచామో యీవేళ లేనిపోని కల తొచ్చింది. పోనీ అతనిపీడపోయింది దీనితోటి" అనిచెప్పి తాను లోపలికిపోయి తగిన పనివెరవున నుండెను. అట్లచ్చటికివచ్చినవా రందరును సంగతి నెరిగి సంతసించుచుండిరి. కొందరు వెడలిపోయిరి. కొందరు వారి వియ్యంకుని చూచి తత్సందర్భవిశేషము లింకను తెలిసికొను నూహతో నచ్చట నేయుండిరి.

* * *

ఒకింతసేపటికి వియ్యంకు లిరువురును కబురులు చెప్పుకొనుచు వచ్చి జరిగినసంగతి నెఱిగిరి. ప్రకాశముగా రంపట తమ వియ్యంకుని మొగముపై దృష్టినిలిపి 'ఏమి టీవింత'? అనియడుగ నాయన 'బావగారూ! మరేమీలేదు లెండి, వద్దంటే మానారు, మనవాళ్లు? మొన్న మా శేషావతారం ఆడకాకి మొగకాకి ఓ చోటుంటే యేమిటో చూచాట్ట; అది తల్లికి చెపితే, కీడుపోతుందని మీచెల్లెలు న నిల్లారాయమని బాధపెట్టింది. నేను ఇదంతా పిచ్చి యెందుకొచ్చింది అని ఊరుకొన్నాను. తరువాత కుర్రాడిచేత రాయించింది కాబోలు యిల్లాగా" అని యాయుత్తర మందుకొని "ఆ! మా చిన్నాడిదస్తూరీయే యిది. ఇంతేలెండి, యిల్లావుంటుంది మనవాళ్లకి పిచ్చినమ్మకము" అని చెప్పెను.



"ప్రకాశముగా రంతట తమవియ్యంకుని......'ఏమిటీవింత?'అనియడుగ"


# అ మృ తాం జ న ము

## సర్వవిధములగు నొప్పులకు సంజీవివంటి దివ్యౌషధము

చక్కని డబ్బీతో సహా సీసా 1-కి 10 అణాలు మాత్రమే

**అమృతాంజనముడిపో, బొంబాయి, లేక, మదరాసు**